## క్లుప్తంగా

### ప్రారంభమైన బొడ్డెమ్మ ఉత్సవాలు



శివ్వంపేటలో బొడ్డెమ్మ ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): బతుకమ్మ ఉత్సవాల్లో భా గంగా మంగళవారం బొడ్డెమ్మల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శివ్వంపేటతోపాటు పలు గ్రామాల్లో ఆవుపేడతో తయారు చేసిన బొడ్డెమ్మలతో మహిళలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. 19 నుంచి చిన్న బతుకమ్మ వేడుకలు ప్రారంభమై 29న సద్దుల బతుకమ్మ (పెద్ద బతుకమ్మ) వేడుకలు నిర్వహించనున్నట్లు పండితుడు శాస్త్రుల వామనశర్మ తెలిపారు.

### శిథిలావస్థలో విద్యుత్ సబ్ స్టేషన్



శిథిలావస్థకు చేరిన విద్యుత్ సబ్ స్టేషన్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు భవనం గదిలోకి నీరు వచ్చి చేరింది. దీంతో గదిలో కూర్చోలేని పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. భవనం ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతో పనులు నిర్వహిస్తున్నామని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి నూతన భవనం ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.

### కరెంట్ షాక్‌తో గేదె మృతి

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో కరెంట్ షాక్‌కు గురై ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన మంగన్న రవి తన గేదెను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. 11 కేవీ లైన్ కండక్టర్ తెగి కింద పడటంతో తీగ తగిలిన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

### తైబజార్‌ను రద్దు చేయాలి



నర్సాపూర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీలో తైబజార్‌ను రద్దు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో తైబజార్‌ను నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేయడంతో చిరువ్యాపారులు, రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు శంకర్, చంద్రయ్య, రాజు, రాంరెడ్డి తదితరులున్నారు. కమిషనర్ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

### భూసమస్యల పరిష్కారానికి కృషి



నిర్మలారెడ్డిని కలిసిన ఆర్డీఓ పాండు

సంగారెడ్డి టౌన్ : నియోజకవర్గంలోని భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీఓ పాండు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట తహసీల్దార్ జయరాం, అధికారులు పాల్గొన్నారు.

### సాయుధ పోరాటంపై దుష్ట రాజకీయం

నారాయణఖేడ్: తెలంగాణ సాయుధ పోరాటంపై బీజేపీ దుష్ట రాజకీయం చేస్తోందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తుకారాం నాయక్ విమర్శించారు. మంగళవారం ఖేడ్‌లో తెలంగాణ సాయుధ పోరాటాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పార్టీ జిల్లా, స్థానిక నాయకులు తెంకటికుమార్, రాజు, రవి, ప్రమోద్, పాపయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



నర్సాపూర్: నర్సాపూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఇంజినీర్లకు సన్మానం

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని పేర్కొన్నారు. ఉపాధ్యాయవృత్తి పవిత్రమైందని, పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చేదిద్దేది గురువులేనన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లక్ష్మీకాంతారావు



టేక్మాల్(మెదక్): టేక్మాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు



కౌడిపల్లి(నర్సాపూర్): మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ భూములను పరిరక్షించండి

### తహసీల్దార్ కమలాద్రి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణలో జీపీఓలు కీలక భూమిక వహించాలని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. నూతనంగా నియామకమైన గ్రామ పాలన అధికారులు, ఇతర సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ భూములను కాపాడుకోవడంలో అందరు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. జీపీఓలు వారికి కేటాయించిన గ్రామాల్లో భూ సమస్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫియొద్దీన్, ఆర్ఐ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కమలాద్రి

## పింఛనుదారుల సంఘం నూతన కార్యవర్గం

### మండల అధ్యక్షుడిగా హఫీజ్

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండల ఫింఛనుదారుల సంఘం అధ్యక్షుడిగా హఫీజ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన పాపన్నపేట మంజీర గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా ఏ.సుధాకర్,ఫైనాన్స్ సెక్రటరీగా టప్ప రాములు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వామన్‌రావు, ఉపాధ్యక్షులుగా నర్సారెడ్డి, సరోజ, జాయింట్ సెక్రటరీగా తిమ్మయ్యగారి లక్ష్మి, పబ్లిసిటీ కార్యదర్శిగా మహిపాల్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జగదీశ్‌చంద్ర, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గోలి కుమార్ వ్యవహరించారు.



మండల ఫింఛన్ దారుల నూతన కార్యవర్గం

### కౌడిపల్లి ఎస్ఐగా మురళి బాధ్యతల స్వీకరణ



కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఎస్ఐగా మురళి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్ఐ రంజిత్‌రెడ్డి మెదక్ వీఆర్‌గా బదిలీ కాగా మెదక్ రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మురళి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ పసుపులేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు మెదక్ రూరల్ ఏఎస్ఐ మధు తెలిపారు. మెదక్ పట్టణం దుర్గా కాలనీకి చెందిన వడ్డె అశోక్‌కు చెందిన ట్రాక్టర్‌గా గుర్తించామన్నారు. ఎలాంటి అనుమతులు లేనందున ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సీఎంను కలిసిన నాయకులు

మనోహరబాద్(తూప్రాన్): మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా నాయకుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి అదిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

## వినూత్న సాంకేతిక పరిజ్ఞానం అవసరం

నర్సాపూర్: సమస్యలకు వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు రూపొందించవచ్చని టీసీఎస్ ప్రతినిధి దిబికర్ పాణిగ్రాహి అన్నారు. స్థానిక బీవీఆర్‌టీలో జాతీయస్థాయి 24 గంటల డెమక్స్ 2.0 హ్యాకథాన్ ప్రారంభ కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చెన్నయ్‌కి చెందిన ఇంటెక్ డిజిటల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మహదేవన్ మాట్లాడారు. సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 132 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, ఐటీ విభాగం హెచ్‌ఓడీ దశరథరామయ్య, హ్యాకథాన్ కన్వీనర్ భీమ, మేనేజర్ బాపిరాజు, ఏఓ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య అతిథులతో కళాశాల ప్రతినిధులు

## అంగన్‌వాడీలకు శిక్షణ

నర్సాపూర్: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణతోపాటు విద్యను కూడా పిల్లలకు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంతోష, కవిత, లక్ష్మీనర్సమ్మ, సుల్తానా, లక్ష్మి, సంతోషిమాతలు సూచించారు. సూపర్ వైజర్లు రెండు బృందాలుగా ఏర్పడి నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, శివ్వంపేట మండలాల్లోని అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణనిచ్చారు. శిక్షణలో భాగంగా పిల్లల ఎదుగుదలపై అవగాహన కల్పించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను పాటించాలని, అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.




శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు



నీటి కోసం ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

## ఖాళీ బిందెలతో నిరసన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని బేగరిగల్లిలో కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ 20 రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. బండ్లపై ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, అయినా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులు స్పందించడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి నీటిని అందజేయాలని కాలనీవాసులు వేడుకొన్నారు.

## ఇంజనీర్లకు సన్మానం

చేగుంట(తూప్రాన్): ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని విద్యుత్ శాఖ ఇంజనీర్లను చేగుంట లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించడం హర్షణీయమని తెలంగాణ విద్యుత్‌సౌధ డీఈ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన సన్మాన సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చేగుంట విద్యుత్ ఉపకేంద్రంతో ఉన్న ప్రత్యక్ష సంబంధాలను గుర్తు చేసుకున్నారు. విద్యుత్ శాఖ డీఈలు ఆశీష్, రఫీక్, రాజలింగం, శ్వేత, ఏడీఈ బండి రాధాకిషన్, కృష్ణ, ఏఈలు సురేశ్, కార్తీక్, మధన్, ప్రభాకర్, కుమారస్వామి, సురేష్‌లను లయన్స్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రతినిధులు నాగరాజు, సుఖేందర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ ఇంజనీర్లను సన్మానించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

## దేవులతండాలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి దేవులతండాలోని శ్రీజగదాంబదేవి, సంత్‌సేవాలాల్ మహరాజ్ ఆలయంవద్ద మంగళవారం గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. జగదాంబదేవి మాలధరించిన గిరిజనులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంవద్ద భోగ్‌బండార్ నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తండాకు చెందిన కోలగోపాల్, రాత్ల జయరాం భోగ్‌బండార్ ఇతర పూజా సామగ్రిని అందచేశారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఆయా ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ అధికారి కృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా స్టాక్, ఎరువుల వివరాలు, పురుగు మందుల అమ్మకాలను పరిశీలించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించవద్దని, మండలానికి చెందిన రైతులకు మాత్రమే యూరియాను అందించాలని డీలర్లను ఆదేశించారు. రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా బిల్లులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వినీత్ తదితరులున్నారు.



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

## బకాయిల ప్రభుత్వం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో ఉన్నది ఇందిరమ్మ ప్రభుత్వం కాదని, బకాయిల ప్రభుత్వమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజుల బకాయిల కోసం విద్యా సంస్థలు బంద్ నిర్వహిస్తుంటే మరోపక్క ఆరోగ్యశ్రీ బిల్లుల బకాయిల కోసం ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు ఇవి ఉదాహరణ అని తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యా సంస్థలకు, ఆసుపత్రిలకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా భూషణం



పాపన్నపేట(మెదక్):పాపన్నపేట మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా భూషణం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పాపన్నపేటలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా రఫీక్, కోశాధికారిగా కేవీఆర్ నాయుడు, ఉపాధ్యక్షుడిగా బాబు, వనిత, సుబ్బలక్ష్మి,జిల్లా కార్యదర్శులుగా అనిల్‌కుమార్, శ్రావణ్‌కుమార్, మండల కార్యదర్శులుగా మోహన్‌రావు, వెంకటేశ్, ఎల్లయ్య, నవీన్‌కుమార్, లక్ష్మణ్‌కుమార్ ,ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమ్లా ఎన్నికల అధికారిగా రవీందర్‌రెడ్డి వ్యవహరించారు.

### గుంత.. ప్రమాదాల చింత



హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని మెదక్– బొడ్మట్‌పల్లి రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయంలో గమనించకుంటే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేయాలని కోరుతున్నారు.

## 'స్థానిక'ంగా సత్తా చాటాలి

రేగోడ్(మెదక్): త్వరలో రానున్న స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా సత్తాచాటాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని గజ్వాడలో పార్టీ సీనియర్ నాయకుడు జంగం శివకుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న క్రాంతికిరణ్ మంగళవారం శివకుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్, మాజీ సర్పంచ్‌లు రవీందర్, నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.



శివకుమార్‌ను పరామర్శిస్తున్న చంటి క్రాంతికిరణ్

## స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి పెట్టాలని ఎస్ఐ నర్సింహులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు, మహిళలకు షీటీం అండగా ఉంటుందన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు వాడుతూ.. అనవసరమైన యాప్స్ వినియోగిస్తూ, మోసాలకు గురవుతున్నారన్నారు. మొబైల్‌లో అనవసర లింక్‌లపై క్లిక్ చేస్తూ సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నర్సింహులు

## 108 తనిఖీ

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన 108 అంబులెన్స్‌ను జిల్లా అధికారి రవికుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వర్షాల కారణంగా వైరల్ ఫీవర్ కేసులు అధికం అయ్యే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. యాక్సిడెంట్ కేసుల పట్ల సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఈఎంటీ సతీష్, పైలట్ దుర్గయ్య, శ్రీకాంత్, పైలట్ మహేశ్వర్ ఉన్నారు.



అంబులెన్స్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు